12092024-DIS-04_Layout 1 9/12/2024 3:43 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## ప్రజాస్వామ్య విలువల పాతర

**పార్లమెంటరీ** ప్రజాస్వామ్యానికి పాలక, విపక్షాలు రెండు చక్రాల వంటివి. రెండూ కలిసి ప్రజాహితమనే ఏకైక లక్ష్యం దిశగా అడుగులు వేయాలి. దీనికనుగుణంగానే వ్యవస్థలు, సంప్రదాయాలూ స్థిరమైనాయి. కానీ, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రజాస్వామిక విలువలను తుంగలో తొక్కి విపరీతపు పోకడలకు పోతున్నది. అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా అరికెపూడి గాంధీని నియమించడమే దీనికి ఉదాహరణ. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన గాంధీ, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. చేరినట్టుగా ఫొటోలు, ఆయన పోస్టు చేసిన ట్వీట్లు కూడా ఉన్నాయి. కానీ, తన పీఏసీ నియామకంపై వివాదం తలెత్తడంతో తాను పార్టీ మారలేదని మాట మార్చారు. గాంధీ ఫిరాయింపుపై అంతిమంగా ఏం జరుగుతుందనేది వేరే విషయం. ప్రతిపక్షాలకు ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని అసెంబ్లీ నియమావళికి, పార్లమెంటరీ స్ఫూర్తికి విరుద్ధంగా తమ పక్షానికే ఇచ్చుకోవడం కాంగ్రెస్ మార్క్ ప్రజాస్వామ్యంగా భావించాలి.

శాసనసభ నిబంధన 250 ప్రకారం దామాషా ప్రాతిపదికన పీఏసీ సభ్యుల ఎంపిక జరగాలి. పీఏసీ ఏర్పాటుచేసే నాటికి బీఆర్‌ఎస్ సభ్యుల సంఖ్య 38. ఆ ప్రకారం ముగ్గురు సభ్యులు బీఆర్‌ఎస్ నుంచి ఉండాలి. ఒక్కో సభ్యుని ఎన్నికకు 13 మంది అవసరమవుతారు. మరి గాంధీని ఎన్నుకున్నది ఏ 13 మంది ఎమ్మెల్యేలో? 1958-59 నుంచి విపక్ష సభ్యుడినే పీఏసీ చైర్మన్‌గా ఎన్నుకునే ఆనవాయితీ ఉన్నట్టు అసెంబ్లీ సభ్యుల కరదీపికలో స్పష్టంగా ఉన్నది. మరి పార్టీ ఫిరాయించిన గాంధీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారు? ఈ తరహా నియామకం జరపడం అసెంబ్లీ నియమావళికి విరుద్ధం కాదా? పీఏసీ అనేది ప్రభుత్వ ఖాతాలను, వ్యయాలను తనిఖీ చేసే కీలక బాధ్యతను నిర్వర్తిస్తుంది. మరి తమ పార్టీ వారికే తాళాలు ఇస్తే సర్కారీ లెక్కల్లో సత్యాసత్యాలను నిగ్గు తేల్చడం సాధ్యమవుతుందా?


ఏ మాత్రం అవకాశం దొరికినా అన్నింటిలో స్వపక్షీయులను జొప్పించాలని చూసే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూడా ఎన్నడూ ఇలాంటి సంప్రదాయ ఉల్లంఘనకు పాల్పడలేదు. 2014-19లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కేవీ థామస్‌ను, మల్లికార్జున ఖర్గేను పీఏసీ చైర్మన్లుగా నియమించి, క్యాబినెట్ ర్యాంకు కల్పించడం గమనార్హం. ఆ తర్వాత అధీర్ రంజన్ చౌదరిని, ప్రస్తుతం కేసీ వేణుగోపాల్‌ను పీఏసీ చైర్మన్‌గా నియమించారు. ఈ సంప్రదాయం ప్రకారమే బీఆర్‌ఎస్ హయాంలో విపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పి.కిష్టారెడ్డి, రామ్ వెంకటరెడ్డి, జె.గీతారెడ్డి, ఎంఐఎంకు చెందిన అక్బరుద్దీన్ ఒవైసీ పీఏసీ చైర్మన్లుగా నియమితులయ్యారు. మరి పొద్దున లేస్తే రాజ్యాంగ విలువలను కాపాడతామని ఊదరగొట్టే కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలంగాణలో జరుగుతున్న విలువల హననం కనిపించడం లేదా? బహిరంగంగా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిహసిస్తుంటే చూసీచూడనట్టు వదిలేస్తారా? ఊరుకో రీతి అవసరానికో నీతి అనేదే కాంగ్రెస్ విధానమా? పార్లమెంట్‌లో విపక్ష హోదాతో కమిటీ పదవులు పొందుతూ ఇక్కడ విపక్షానికి ఆ అవకాశం దక్కకుండా చేయడం ద్వంద్వ ప్రమాణాల కిందకు రాదా?

# ఉపన్యాసాలు వేరు, ఆచరణ వేరు

**ఒక స్థాయికి వెళ్లిన తర్వాత ప్రతి ఒక్కరికీ విలువల గురించి చెప్పాలని ఉంటుంది. ఇది అత్యంత సహజమైన లక్షణం. దీనిలో తప్పు పట్టాల్సిందేమీ లేదు. జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీకి చెందిన దాదాపు 1100 మంది జర్నలిస్టులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాలో విలువలు, యూట్యూబ్ చానల్స్ విశృంఖలత, రాజకీయాల్లో విలువల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల మీద తమను విమర్శించారని యూట్యూబ్ ఛానల్స్ చర్చలతో తీవ్రంగా స్పందించినా, మెయిన్ స్ట్రీమ్ మీడియా మాత్రం పెద్దగా స్పందించలేదు.**



**బుద్దా మురళి**



మీడియా గురించి, విలువల గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు విన్నాక దాదాపు 15 ఏండ్ల కిందట రేవంత్‌రెడ్డి సమక్షంలోనే జరిగిన ఒక చర్చ గుర్తుకువచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో అప్పుడు టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నది. టీడీపీ అప్పటి అధికార పక్షానికి చెందిన పత్రిక సాక్షిని టార్గెట్ చేసింది. అప్పటివరకు మీడియా అంటే దాదాపు 90 శాతం టీడీపీ అనుకూల మీడియానే. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ మీడియా నిలవడం అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబుకు కంటగింపుగా మారింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు లాబీలోని తన ఛాంబర్‌లో మీడియాతో బాబు మాట్లాడుతూ 'అక్రమ సంపాదనతో పెట్టిన మీడియాలో మీరు ఎలా పనిచేస్తారు, బయటకు రండి' అని మీడియాను ఉద్దేశించి ఆగ్రహంగా పలికారు. అప్పుడు టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి అక్కడే ఉన్నారు. టీడీపీ బీట్ రిపోర్టర్‌గా ఆంధ్రభూమి తరఫున నేను అక్కడ ఉన్నాను. బాబు ఆవేశం మీద నీళ్లు చల్లుతూ 'కాంగ్రెస్ పత్రిక అక్రమ సంపాదనతో పెడితే మీ పార్టీకి అండగా ఉండే పత్రిక ఏ సంపాదనతో పెట్టారు? ఆ పత్రికలో పనిచేసే జర్నలిస్ట్ పత్రికనే కొనేశాడు. ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు కూడబెట్టి కొన్నాడా?' అని నేను ప్రశ్నిస్తే బాబు సమాధానం చెప్పలేదు. ఛాంబర్ నుంచి బయటకు వచ్చాక రేవంత్‌రెడ్డి నాతో 'నిజమే నువ్వు చెప్పేదాకా ఆ ఆలోచన రాలేదు. అన్ని పత్రికలు అంతే కదా?' అని అబ్బురపడిపోయారు. రేవంత్‌రెడ్డి ఆనాటి అభిప్రాయానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. అప్పుడు ఆయన టీడీపీ శాసనసభ్యుడు మాత్రమే. ఇప్పుడు ముఖ్యమంత్రి కాబట్టి అచ్చం ఆ రోజు చంద్రబాబు ఆలోచన విధానంలోనే ఈ రోజు రేవంత్‌రెడ్డి చెప్తూ రాజకీయాల్లో, మీడియాలో విలువల గురించి బోధిస్తున్నారు.

కాంగ్రెస్‌లో జూనియర్ అయినా 'కాంగ్రెస్‌కు ఏకైక ఆశాకిరణం' రేవంత్‌రెడ్డి అనే విధంగా ప్రచారం చేయడంలో రేవంత్ రెడ్డి సొంత యూట్యూబ్ బృందాలు విశేషంగా కృషిచేశాయి. మంచి కన్నా, చెడు ప్రచారం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తుంది. అలా అప్పుడు రేవంత్‌రెడ్డి యూట్యూబ్ బృందం విజయవంతంగా పనిచేసింది. చివరికి కాంగ్రెస్ పార్టీ వాళ్లే యూట్యూబ్ బృందాల ద్వారా కాంగ్రెస్ సీనియర్‌లకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్‌కుమార్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ యూట్యూబ్‌లను నడిపించే స్థావరాలపై దాడులు కూడా జరిపారు. రేవంత్‌రెడ్డి తక్కువ కాలంలో రాజకీయాల్లో ఎదగడానికి, కాంగ్రెస్ సీనియర్లను పక్కనపెట్టి ఏకైక ఆశాకిరణం అనుకునే స్థాయికి చేరుకోవడానికి మీడియాతో పాటు రేవంత్‌రెడ్డి సొంత యూట్యూబ్ సైన్యం గణనీయమైన పాత్ర పోషించింది. అందుకే, రేవంత్‌రెడ్డి యూట్యూబ్ చానళ్ల అరాచకాన్ని లేవనెత్తడంపై ట్యూబ్స్ తీవ్రంగా స్పందిస్తున్నాయి. సబ్బుల వ్యాపారం ఎలానో మీడియా వ్యాపారం కూడా అంతే.. దానికి మీరు ఎక్కువగా విలువలు ఆపాదిస్తున్నారని దార్శనికులు, స్వయంగా జర్నలిస్ట్ అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1950 ప్రాంతంలోనే చెప్పారు. సబ్బుల వ్యాపారం, చెప్పుల వ్యాపారం, కూల్‌డ్రింక్స్ వ్యాపారం ఎలాగో రాజకీయ వ్యాపారం అంతే. సంపాదనే నేటి రాజకీయాల్లో సిద్ధాంతం.

> **రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కాదు, పీసీసీ అధ్యక్షునిగా, అంతకు ముందు టీడీపీ అధ్యక్షునిగా, టీడీపీలో శాసనసభ్యునిగా ఉన్నప్పుడు కూడా మీడియా గురించి సంపూర్ణ అవగాహన ఉన్నది. తనకు వ్యతిరేకంగా రాస్తే మీడియా సమావేశంలో 'మీడియా వాళ్లు తమ డీఎన్ఏ పరీక్ష చేయించుకోవాలి' అని తిట్టినవారు ఆయన.**

యూట్యూబ్ చానళ్లు, పత్రికలు, చానళ్లు అన్నీ ఏదో ఒక పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్నాయి. గతంలో ఎన్నికల ముందు రాజకీయపార్టీలు పుట్టుకువచ్చేవి. ఇప్పుడు ఎన్నికల ముందు డజన్ల కొద్ది యూట్యూబ్ చానళ్లను రాజకీయ నాయకులే పుట్టిస్తున్నారు. ఏదైనా తేడా వస్తే సీనియర్‌ల కోటాలో సీఎం కావచ్చు అని ఆశిస్తున్న సంపన్న సీనియర్ నాయకుడు ముందుచూపుతో రెండు పత్రికలు, రెండు చానళ్లు పెట్టే సన్నాహాలు చేస్తున్నట్టు మీడియా సర్కిల్‌లో ప్రచారం జరుగుతున్నది. రవీంద్రభారతిలో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో మీడియా, రాజకీయ పార్టీల అనుబంధం గురించి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల అనుబంధం లేని మీడియా కూడా ఉందా? ఈ విషయం రేవంత్‌రెడ్డికి తెలియదా? నిజానికి ఏ మీడియా, ఏ పార్టీకి అనుబంధమో రేవంత్‌రెడ్డికి అందరి కన్నా ఎక్కువ తెలుసు. ఓటుకు నోటు ఉదంతంలో స్వయం గా రేవంత్‌రెడ్డినే ప్రధాన మీడియా చానళ్ల పేర్లు ప్రస్తావించి టీడీపీకి అనుకూల మీడియా గురిం చి స్టీఫెన్ సన్‌కు చెప్పారు.

ఇప్పుడు అన్ని పార్టీలకూ మీడియా ఉన్నది. ఆంధ్రలో ఒక పార్టీకి పెద్ద ఎత్తున తటస్థ మద్దతుదారులు ఉంటారు. వారు పార్టీ వాళ్లమని ఒప్పుకోరు. పార్టీకి అనుకూలమే కానీ, తటస్థులం అని చెప్పుకుంటారు. మీడియా సైతం అంతే ఏదో ఓ పార్టీకి తటస్థ మద్దతుదారులు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తమ కార్యాలయాల్లో ప్రెస్ కాన్ఫరెన్స్‌కు ప్రత్యర్థి పార్టీల మీడియా రిపోర్టర్‌లను బహిష్కరించాయి. మీడియా, రాజకీయపక్షాల అనుబంధం, రాజకీయ నాయకులే యూట్యూబ్ గుంపులను ప్రారంభించిన విషయం, తమ ప్రత్యర్థులపై ప్రచారదాడికి యూట్యూబ్ చానళ్లను నడిపిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. రాజకీయ వ్యాపార క్రీడలో మీడియా ఎంతోకొంత తన విశ్వసనీయతను కోల్పోయిన మాట నిజం.

> **రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడిన మరుసటి రోజే, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి దూకిన శాసనసభ్యులు అరికెపూడి గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ప్రతిపక్షానికి చెందిన శాసనసభ్యున్నే పీఏసీ చైర్మన్‌గా నియమించారు. నియంతృత్వంగా రాష్ట్ర ప్రభుత్వాలను తారుమారు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఈ ఆచారాన్ని పాటించారు.**

తొలిసారి తెలంగాణలో వేరే పార్టీ నుంచి చేరిన వారిని పీఏసీ చైర్మన్‌గా నియమించారు. మీడియాలో, వ్యాపారంలో, రాజకీయాల్లో విలువల గురించి ఉపన్యాసాలు వేరు, ఆచరణ వేరు. ఈ రంగాల్లో విలువలు ఆశించడం అత్యాశే అనిపిస్తున్నది.

> **కాంగ్రెస్‌లో జూనియర్ అయినా 'కాంగ్రెస్‌కు ఏకైక ఆశాకిరణం' రేవంత్‌రెడ్డి అనే విధంగా ప్రచారం చేయడంలో రేవంత్ రెడ్డి సొంత యూట్యూబ్ బృందాలు విశేషంగా కృషిచేశాయి. మంచి కన్నా, చెడు ప్రచారం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తుంది. అలా అప్పుడు రేవంత్‌రెడ్డి యూట్యూబ్ బృందం విజయవంతంగా పనిచేసింది... రేవంత్‌రెడ్డి తక్కువ కాలంలో రాజకీయాల్లో ఎదగడానికి, కాంగ్రెస్ సీనియర్లను పక్కన పెట్టి ఏకైక ఆశాకిరణం అనుకునే స్థాయికి చేరుకోవడానికి మీడియాతో పాటు రేవంత్‌రెడ్డి సొంత యూట్యూబ్ సైన్యం గణనీయమైన పాత్ర పోషించింది.**

> **రవీంద్రభారతిలో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో మీడియా, రాజకీయ పార్టీల అనుబంధం గురించి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల అనుబంధం లేని మీడియా కూడా ఉందా? ఈ విషయం రేవంత్‌రెడ్డికి తెలియదా?**

# బీసీలు.. పల్లకీ మోసే బోయిలేనా?

**కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్ష పదవిని బీసీ సామాజిక వర్గానికి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, బీసీలకు ఏదో రాష్ట్రాన్నే రాసిచ్చినట్టు.. కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తున్నదనే వార్తలు కొంత విస్మయాన్ని కలిగిస్తున్నాయి. జనాభా పరంగా చూస్తే రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నది బీసీలే. అయితే, వారికి అరకొరగా పదవులిచ్చి, అన్నీ బీసీలకే ఇచ్చినట్టు ఆయా మీడియా సంస్థల ద్వారా ప్రచారాలు సాగించడాన్ని బీసీలు అర్థం చేసుకొని, అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా యావత్ బహుజన జాతి ఇంకా మోసానికి గురవుతూనే ఉంటుంది.**



**ముఖేష్ సామల**
**97039 73946**

డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇదే పీసీసీ పదవిని బీసీ సామాజిక వర్గమైన దివంగత డి.శ్రీనివాస్‌కు ఇచ్చి ఓట్ పోలరైజేషన్‌కు వాడుకున్న మాట వాస్తవం కాదా? వైఎస్ మరణానంతరం బీసీ వ్యక్తి పీసీసీగా ఉన్నా, వైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యను, ఆ తర్వాత కిరణ్‌కుమార్‌రెడ్డిని సీఎం సీటులో కుర్చోబెట్టింది కాంగ్రెస్ పార్టీ కాదా? ముఖ్యమంత్రిగా బీసీ నేతలకు ఆ పార్టీ అవకాశం ఇవ్వలేదు. అంటే, బీసీలకు కాంగ్రెస్ జెండాను మోసే అర్హత మాత్రమే ఉన్నదా? అధికార పీఠాన్ని ఎక్కే స్థాయి, శక్తియుక్తులు బీసీలకు లేవా? అనే ప్రశ్న యావత్ బీసీలోకంలో తలెత్తుతున్నది. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ బలంగా ఉన్నప్పుడు, వారు ఆడిందే ఆట, పాడిందే పాట అయ్యింది. ఆ రోజుల్లోనే ఢిల్లీ అధిష్ఠానం బీసీలపై మమకారం చూపలేదు. అంటే, రాష్ట్రాన్ని ఏలగలిగే సమర్థులు బీసీల్లో కూడా ఉన్నారని ఆ పార్టీ అనుకోవడం లేదని మనం అర్థం చేసుకోవాలి.

సరే గతం గతః అని వదిలేసి, ఇప్పటి విషయానికి వద్దాము. మధుయాష్కీ లాంటివారికి అధిష్ఠానం వద్ద చొరవ ఉన్నా, కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ప్రకటించలేదు. అన్నిపార్టీల కండువాలు మార్చినవారికే ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టి బీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి ఏమిటో చెప్పకనే చెప్పింది. అంతేకాదు, కనీసం నామినేటెడ్ పోస్టుల్లోనో, పార్టీ పదవుల్లోనో, కార్పొరేషన్ పదవుల్లోనో, కమిషన్ల నియామకాల్లోనో బీసీలకు జనాభా దామాషా ప్రకారం కేటాయించి సామాజిక న్యాయం పాటించిందా? అంటే, అదీ లేదు. పార్టీలో తొండికో మొండికో బీసీ గళం వినిపించే వి.హన్మంతరావు లాంటోళ్లు, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కత్తి వెంకటస్వామి లాంటివారు కూడా ఉత్సవ విగ్రహాలుగానే మిగిలిపోయారు. సరే, ఇవన్నీ బీసీలు వదిలేసుకున్నప్పటికీ, ప్రభుత్వ యంత్రాంగంలో బీసీ అధికారులకు ఎటువంటి ప్రాధాన్యం ఉందో, ఏ వర్గాల వాళ్లు పెత్తనం చెలాయిస్తున్నారో, బాజాప్తా మాది గవర్నమెంట్ అని బహిరంగంగా చెప్పుకొంటున్న వర్గమేదో కూడా బీసీలు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన సందర్భం ఇది. సరిగ్గా ఇందిరమ్మ దేశాన్ని పాలిస్తున్న సమయంలో, 1982 జనవరిలో అప్రెస్డ్ ఇండియన్ అనే పత్రిక ఎడిటోరియల్‌లో 'మనకు రాజకీయ రిజర్వేషన్లున్నాయి, కానీ, నిర్ణయాలు తీసుకునే హక్కు మాత్రం మనకు లేదు. నిర్ణయాలు తీసుకోబడుతాయి, ప్రణాళికలు తయారు చేయబడుతాయి. అయితే, అవన్నీ ఎవరైతే మనకు శత్రువులో వారు మాత్రమే తయారుచేస్తారు. వాళ్ళు మన తరపున నిర్ణయాలు తీసుకుంటారు. భారతదేశంలో ప్రజాస్వామ్య విధానం ఈ విధంగా ఉన్నది'




అని రాసింది. ఆనాటి ప్రజాస్వామిక పరిస్థితులను ఆ పత్రిక ఎద్దేవా చేసినట్టుగానే, నేటి తెలంగాణ ఇందిరమ్మ రాజ్యంలోనూ అవే పరిస్థితులు దాపురిస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీ దృష్టిలో ఏ పదవులకు పనికిరాని బీసీలు, కేవలం లోకల్‌బాడీ ఎన్నికల్లో వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వంటి చిన్నాచితకా పదవులకు మాత్రమే అర్హులు. బీసీ కులాలను ఉద్ధరించేందుకే కమిషన్ వేసి లెక్కలు గట్టి 'కిందిస్థాయిలో మీరు ఉండండి మీపైన మేము పెత్తనం చేస్తాం' అన్నట్టుగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ అంశాన్ని ముందుకు తెస్తున్నది. ఇదెలా ఉందంటే.. 'పండ్లు మేం తింటాం, మీరు తొక్కలు తినండి' అన్నట్టుగా ఉన్నది. తెలంగాణ శాసనసభలో 22 మంది మాత్రమే బీసీ ఎమ్మెల్యేలు ఉండటాన్ని బీసీ సామాజిక వర్గం గమనించాలి. కాంగ్రెస్ పార్టీ డబ్బులున్న ఎన్నారైలకు మాత్రమే టిక్కెట్లు ఇచ్చింది కానీ, స్థానికంగా పార్టీకి లాయల్‌గా ఉన్న బీసీ లీడర్లను కేవలం పల్లకీ మోసే బోయిలుగానే చూసింది. ఎవరు ఔనన్నా, కాదన్నా ఇది నూటికి నూరు శాతం నిజం. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు ఉండలేదన్నది వాస్తవమే కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇంతటి దీనస్థితి, కుల వివక్షకు బీసీ లెప్పుడూ గురికాలేదు. కేసీఆర్ హయాంలో బీసీల్లోని ఒక్కో వర్గాన్ని గుర్తు పెట్టుకొని మరీ ఆయా పదవుల్లో అకామడేట్ చేసి తగిన గౌరవం ఇచ్చారు.

రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులను కొంచెం సునిశితంగా గమనిస్తే దళితుల కంటే దయనీయమైన స్థితిలో బీసీ బిడ్డలున్నారనే విషయం అర్థమవుతున్నది. ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికెట్‌లో ఏ విధంగానైతే 'వెనుకబడిన తరగతులు' అని రాసినట్టుగా బీసీలు అన్నింటిలోనూ వెనకబడే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ ఇంకా బీసీలను దగా చేస్తూనే ఉన్నది. యాదగిరిగుట్టలో దళితుడైన ఉప ముఖ్యమంత్రి భట్టికి చిన్నపీట వేసి మిగతా అగ్ర వర్ణాలు పెద్ద పీటల మీద కూర్చున్నట్టే, బీసీ బిడ్డ అయిన పీసీసీ అధ్యక్షుడికి చిన్నపీట వేసి ముఖ్యమంత్రి పెద్ద పీట మీద కూర్చొని వినాయక పూజలో పాల్గొన్నారు. పాలకునికి ఎంతటి కుల దురహంకారమో అన్నది దీన్నిబట్టే అర్థమవుతున్నది. ప్రజలు గమనిస్తున్నారు. కర్రు కాల్చి వాతపెట్టే సమయం ఎంతో దూరం లేదు.

**(వ్యాసకర్త: హైకోర్టు న్యాయవాది, రాజకీయ విశ్లేషకులు)**




## ఈ వ్యతిరేకత నేటిది కాదు!



**రిజర్వేషన్లను పేదలకు దూరం చేయాలన్న రాహుల్‌గాంధీ వైఖరి కొత్తదేమీ కాదు. నెహ్రూ-గాంధీ కుటుంబం ఏండ్ల తరబడి అవలంబిస్తున్న వైఖరికి ఆయన వ్యాఖ్యలే నిదర్శనం. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ గతంలో సమర్థించి, అమలులో విఫలమైన దాని గురించే నేడు రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారు.**

**- హిమంత బిశ్వ శర్మ,**
అసోం ముఖ్యమంత్రి

**కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అలుపెరగని పద్నాలుగేండ్ల పోరాట ఫలితంగా స్వరాష్ట్రం సిద్ధించింది. అరువై ఏండ్ల వలస పాలనలో అన్నిరకాల వివక్షకు గురై, వెనుకబడిన తెలంగాణను అనతికాలంలోనే ప్రగతిపథంలో నడిపించిన మహనీయుడు కేసీఆర్. జాతీయ పార్టీల కుట్రల నుంచి కాపాడటమే కాకుండా తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారు. ఏ రాష్ట్రంలోనూ లేని సంక్షేమ పథకాలను అమలుచేసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేశారు. కేసీఆర్ అకుంఠిత దీక్షతో తెలంగాణ అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో దూసుకుపోయింది. అలాంటి తెలంగాణ నేడు మళ్లీ ఆగమవుతున్నది.**

# మళ్లీ మొదలైన కుట్ర



**రాజేశ్ నాయక్**
**96035 79115**



తెలంగాణకు గుండెకాయ లాంటి హైదరాబాద్ కేసీఆర్ హయాంలోనే విశ్వనగరంగా అవతరించింది. మౌలిక వసతులు, శాంతిభద్రతల పరంగా ఎంతగానో పురోగమించింది. అంతేకాదు, అనేక ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించి ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెట్టారు. తత్ఫలితంగా ప్రపంచ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయి. స్వయంగా రైతు అయిన కేసీఆర్ అన్నదాతల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేశారు. ఏటా ఎకరానికి పెట్టుబడి సాయంగా రూ.10,000 అందించి తాను రైతు పక్షపాతినని నిరూపించుకున్నారు. ఈ పథకాన్ని ఐరాస సైతం కొనియాడింది. అకాల మరణం చెందిన రైతుల కుటుంబసభ్యులు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో తీసుకొచ్చిన రైతుబీమా పథకం విప్లవాత్మకమైంది. ఈ పథకం ద్వారా చనిపోయిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించారు. పేదోళ్ల బిడ్డలు కూడా ఇంగ్లీష్ చదువులు చదివి, ప్రపంచంతో పోటీపడాలనే ఉద్దేశంతో అనేక గురుకులాలను స్థాపించారు. రాష్ట్రంలోని గురుకులాలను వెయ్యికి పెంచి, ఏటా లక్షలమంది విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో కూడిన నాణ్యమైన ఉచిత విద్యనందించారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేవిధంగా పాలన వికేంద్రీకరణ చేసి జిల్లాలు, మండలాలు, పంచాయతీల సంఖ్యను పెంచారు. ప్రతి జిల్లాలో కలెక్టరేట్ల నిర్మాణం, మండల, గ్రామ పంచాయతీల కార్యాలయాలను ఏర్పాటుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి సాగును బాగు చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రగతిపథంలో పరుగులు పెట్టించారు. అంతేకాదు, మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు మనకే దక్కాయి. కానీ, వీటన్నింటిని ప్రచారం చేసుకోవడంలో బీఆర్‌ఎస్ విఫలమైంది. అదే సమయంలో నాటి ప్రతిపక్షాలు లేనిపోని దుష్ప్రచారం చేశాయి. వెరసి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమిపాలైంది. ఒకే అబద్ధాన్ని పదే పదే చెప్పడంతో అదే నిజమని ప్రజలు భ్రమపడి కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారు. కానీ, నమ్మి ఓట్లేసిన ప్రజలను హస్తం పార్టీ ప్రభుత్వం నట్టేట్లో ముంచింది. 9 నెలల కాలంలోనే రేవంత్‌రెడ్డి సర్కార్‌పై ప్రజల్లో అసహనం మొదలైంది.

బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ వైపు కన్నెత్తి చూడని ఆంధ్రా పెత్తందార్లు నేడు మళ్లీ రాష్ట్రంలో కార్యకలాపాలు కొనసాగించేందుకు ఉవ్విళ్లూతున్నారు. పదవుల పంపకంలో మళ్లీ ఆంధ్రోళ్ల ఆధిపత్యం మొదలైంది. తెలంగాణ బిడ్డల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం నిస్సిగ్గుగా ఆంధ్రాపెత్తందార్లకు వంతపాడుతున్నది. 'మాకు తెలంగాణవాళ్లు వద్దు, ఆంధ్రావాళ్లే ముద్దు' అనే ఎజెండాతో రేవంత్ సర్కార్ ముందుకుపోతున్నది. తెలంగాణవారికి న్యాయంగా దక్కాల్సిన పదవులను ఆంధ్రోళ్లకు కట్టబెడుతున్నది. ఆంధ్రాకు చెందిన సి.ఆంజనేయరెడ్డిని బుద్ధవనం ప్రాజెక్టు డైరెక్టర్‌గా, అనంతపురం జిల్లాకు చెందిన అనితా వావిళ్లకు తెలంగాణ రెడ్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా, నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను నీటి పారుదల జలవనరుల సలహాదారులుగా నియమించడం అందులో భాగమే. అదేవిధంగా ఏపీకి చెందిన రఘునాథ్ రెడ్డికి మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలోకి తీసుకోవడం, సూర్యదేవర ప్రసన్న కుమార్‌ను తెలంగాణ శాసన మండలి సలహాదారుడిగా, శ్రీనివాస్‌రాజును తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడిగా, ఆంధ్రాకు చెందిన జర్నలిస్టు శ్రీరామ్ కర్రికి తెలంగాణ మీడియా అండ్ కమ్యూనికేషన్ పదవి కట్టబెట్టడం కూడా ఈ కోవకు చెందినవే. ఈ నియామకాల వెనుక చాలా పెద్ద కుట్ర దాగి ఉన్నదని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. వీళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానమివ్వాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వైఖరి రాష్ట్రానికి చాలా ప్రమాదకరం. దీనిపై పౌర సమాజం మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.